Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
22-11-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 334 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
శనివారం
WWW.EPAPER.MAHAADAILY.COM


టాప్ న్యూస్



## సీఐడీ విచారణకు శ్రీముఖి, నిధి అగర్వాల్

జంగిల్ రమ్మీకి ప్రమోట్ చేసిన శ్రీముఖి

02



## ప్రధానమంత్రి ఉచిత స్కూటీ స్కీం

- పీఐబీ ఫ్యాక్ట్ చెక్ క్లారిటీ

02



## విశ్వం ఆమెకే వశం

**మిస్ యూనివర్స్-2025గా ఫాతిమా బాష్**

- కిరీటాన్ని దక్కించుకున్న 25 ఏళ్ల అందాల భామ
- థాయ్‌లాండ్‌లోని నాంథబురిలో ఆట్టహాసంగా వేడుక
- మిస్ యూనివర్స్ విజేతకు 2,50,000 డాలర్ల ప్రైజ్ మనీ
- ఈ ఏడాది పోటీ థీమ్ 'ది పవర్ ఆఫ్ లవ్' (ప్రేమ శక్తి) పేరుతో

వివరాలు 2లో



# రేవంత్ దూకుడు అడ్డుకోండి

## చంద్రబాబుకు ఏపీ మాజీ సీఎం జగన్ లేఖ


## తెలుగు రాజకీయాల్లో సంచలనం

హైదరాబాద్ వచ్చి వెళ్ళిన మరుసటి రోజే సంచలనం

ఒక్క టీఎంసీ తగ్గినా బాధ్యత మీదే అంటూ తెలంగాణ స్పీడును లేఖలో పేర్కొన్న జగన్

**హైదరాబాద్ - మహా:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చూపు ఇపుడు తెలంగాణపై పడింది. హైదరాబాద్ లో సిబిఐ కోర్టుకు హాజరైన సందర్భంగా తన మద్దతుదారులు, అభిమానులు హైదరాబాద్ లో ఉన్నారంటూ.. ఓ రకంగా బలప్రదర్శన చేసిన జగన్ హైదరాబాద్ వచ్చి వెళ్ళిన మరుసటి రోజే రేవంత్ నాయకత్వంలోని తెలంగాణ సర్కారు దూకుడు అడ్డుకోకపోతే ప్రమాదమంటూ నేరుగా ఏపీ సీఎం చంద్రబాబుకే లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలో పనులన్నీ చక్కబెట్టుకుంటుండగా, ఏపీకి నష్టం జరిగే ప్రమాదం కనిపిస్తోందని, తెలంగాణ డిమాండ్ కు అంగీకరించినా.. పునర్విభజనను నిరోధించకున్నా జరిగే నష్టానికి బాధ్యత వహించాలంటూ లేఖ ద్వారా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఓ కొత్త చర్చకు తెరలేపారు.

మిగతా 2లో






ప్రచారానికి అనుమతి

## ఇవ్వలేం

- టీవీకే పార్టీ చీఫ్ విజయ్‌కి పోలీసులు షాక్
- భద్రతా కారణాల వల్ల అనుమతి ఇవ్వలేమని స్పష్టం

వివరాలు 2లో




## నేడు పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు

డెడికేషన్ కమిషన్ నివేదికకు మంత్రివర్గం ఆమోదం

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండేలా కొత్త రిజర్వేషన్లపై నివేదికను డెడికేటెడ్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రుల వద్దకే ఫైలును పంపించి ఆమోదం తెలుపుతూ శుక్రవారం సంతకాలు తీసుకున్నారు. దీనితో గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు ఖరారు

మిగతా 2లో

## పదవులు అడుక్కుంటే రావు.. పోరాడి గుంజుకుంటేనే వస్తాయి

- హక్కుల సాధనకు పోరాటం తప్పదు
- మత్స్యకారులు రాబోయే కాలంలో ఐక్యంగా ఉండాలి
- ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్



**నాగర్ కర్నూల్, మహా:** తెలుగు జాతిలో సాహసం, ధైర్యం ఉన్నప్పటికీ, వెనుకబడ్డామనే ఆవేదన ఉందని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఉత్సవాలలో ఎంపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, హక్కుల సాధనకు త్యాగాలు, పోరాటాలు తప్పవని అన్నారు. మత్స్యకారుల ఐక్యత కోసం నీలం మధు చేస్తున్న ప్రయత్నం సఫలం కావాలని కోరుకున్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయ్యాక, తాండూరు ఎమ్మెల్యే నారాయణ రావు ముదిరాజ్ తో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కోరి, ముదిరాజ్‌లను బీసీ డి నుండి బీసీ ఏ లోకి మార్చాలని విజ్ఞప్తి చేశామని, జడ్చర్ల ఎన్నికల్లో ప్రకటించినా అది నెరవేరలేదని గుర్తుచేశారు. మంత్రిగా ఉన్నప్పుడు, సన్న బియ్యం సమస్య తర్వాత, మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కోరానని తెలిపారు. పోచారం తో కలిసి అనేక రాష్ట్రాలు పర్యటించిన తర్వాత కేజీ కల్చర్, డీసీఎంల పంపిణీ వంటి పథకాలు వచ్చినా, అవి పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు.

## సంక్షేమ పథకాల జాతర

- **ఒకే నెలలో రూ. 480 కోట్లు విడుదల**
- **రైతు, మహిళా, మైనారిటీ వర్గాలే లక్ష్యం**
- **₹200 కోట్లతో రైతులకు బోనస్**
- **మైనారిటీ సంక్షేమానికి రూ. 220 కోట్లు**
- **₹60 కోట్లతో మహిళలకు ఉపశమనం**

**హైదరాబాద్,మహా:**

రాష్ట్రంలో వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, అధికార పక్షం తమ రాజకీయ వ్యూహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేసింది. రైతు, మహిళ, మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని మొత్తం రూ. 480 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన విడుదల చేసింది. ఈ కేటాయింపులు కేవలం పరిపాలనాపరమైన చర్యలు మాత్రమే కాదని, రాబోయే ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు సిద్ధం చేసుకున్న 'ప్రజాకర్షక అస్త్రాలు' అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మిగతా 2లో

## కేటీఆర్.. అసత్యాలు చెప్పడం మానండి

- అడ్డగోలు జీవోలు, చెల్లింపులు మా హయాంలో లేవు
- పెట్టుబడులు రాకూడదు, జరగకూడదు ఇదే నీ ఆలోచనా?
- ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం
- మాజీ మంత్రి కేటీఆర్‌కు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్



**హైదరాబాద్, మహా:** పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నారని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా విమర్శించారు. గత ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఏదో మతలబు ఉండేదని ఆరోపించారు.

మిగతా 2లో




కట్టుకథల మాటున

## రక్తపాతం!

దండకారణ్యంలో దారుణం

- హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకమే
- విజయవాడలో బంధీ, మారేడుమిల్లిలో హత్యాకాండ
- ఫాసిస్ట్ ప్రభుత్వ దమనకాండకు నిదర్శనం
- చికిత్స కోసం వచ్చిన అగ్రనేతను పట్టుకుని క్రూర హత్య
- హిడ్మా, శంకర్ సహా 6గురిని కిరాతకంగా చంపారు
- నవంబర్ 23న దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు
- భగత్ సింగ్, అల్లూరి చరిత్రలకు తోడుగా హిడ్మా వీరగాథ
- పీడిత ప్రజల నాయకుడిపై విష ప్రచారం
- మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన

02



## సీఐడీ విచారణకు శ్రీముఖి, నిధి అగర్వాల్

**జంగిల్ రమ్మీకి ప్రమోట్ చేసిన శ్రీముఖి**

**హైదరాబాద్, మహా:** బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వ్యవహారంలో ప్రముఖ సినీ తారలు నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృతా చౌదరి సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన ప్రముఖులను సీఐడీ అధికారులు వరుసగా విచారిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల నటులు విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లను సీఐడీ అధికారులు విచారించారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని సీఐడీ వరుసగా విచారణకు పిలుస్తోంది. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి వీరు విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ యువత ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో, వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులపై కొన్ని నెలల క్రితం కేసు నమోదైంది. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్ అంశంపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. శ్రీముఖి జంగిల్ రమ్మీ యాప్‌ను ప్రమోట్ చేయగా, అమృత చౌదరి పలు బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేశారు.

## ప్రచారానికి అనుమతి ఇవ్వలేం

- టీవీకే పార్టీ చీఫ్ విజయ్‌కి పోలీసులు షాక్
- భద్రతా కారణాల వల్ల అనుమతి ఇవ్వలేమని స్పష్టం

**తమిళనాడు, మహా:** కరూర్ దుర్ఘటన తర్వాత పునః ప్రారంభించ తలపెట్టిన తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ ప్రచారానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. డిసెంబర్ 4న సేలంలో జరగాల్సిన ఈ కార్యక్రమం కోసం సమర్పించిన చేసిన దరఖాస్తును తిరస్కరించారు. ఆ తేదీల్లో భద్రతా కారణాల వల్ల అనుమతి ఇవ్వలేమని మొదట పోలీసులు తెలిపారు. పార్టీకి ఇచ్చిన లేఖలో మాత్రం భద్రతా సిబ్బంది లేకపోవడం, ఎంత మంది ప్రజలు హాజరవుతారనే కచ్చితమైన వివరాలు లేకపోవడం వంటి అంశాలను కారణాలుగా చూపారు. భవిష్యత్తులో విజయ్ ప్రజా సమావేశాలకు అనుమతి కోరినట్లయితే కార్యక్రమం తేదీకి నాలుగు వారాల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో టీవీకే ప్రచారాన్ని ప్రత్యామ్నాయ తేదీల్లో నిర్వహించుకునేందుకు అనుమతి కోసం త్వరలోనే దరఖాస్తు చేసుకుంటామని పార్టీ వర్గాలు తెలిపాయి. సేలం తర్వాత ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో కూడా విజయ్ ప్రచారం చేయాలని యోచిస్తున్నారు

**ప్రధానమంత్రి ఉచిత స్కూటీ స్కీం**

## పీఐబీ ఫ్యాక్ట్ చెక్ క్లారిటీ

**మహా:** ప్రధానమంత్రి ఉచిత స్కూటీ యోజన' పేరుతో కేంద్ర ప్రభుత్వం పథకం అమలు చేస్తోందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలో నిజం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కళాశాలలకు వెళ్లే యువతులకు ఉచితంగా స్కూటీలను పంపిణీ చేస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి స్కాంల ఉచ్చులో పడవద్దని హెచ్చరించింది. ఈ ప్రచారంలో నిజం లేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం అలాంటి పథకాన్ని తీసుకురాలేదని తెలిపింది. అధికారిక సమాచారం కోసం పీఐబీ ఫ్యాక్ట్ చెక్ లేదా సంబంధిత మంత్రిత్వ శాఖల వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించింది. వాట్సాప్, ఎస్సెమ్మెస్ లేదా ఈమెయిల్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని కేంద్రం హెచ్చరిస్తోంది.

## పదవులు అడుక్కుంటే రావు.. పోరాడి గుంజుకుంటేనే వస్తాయి

(మొదటిపేజీ తరువాయి)

పదవులు అడుక్కుంటే రావు, గుంజుకుంటే వస్తాయి అని స్పష్టం చేస్తూ, మత్స్యకారులు రాబోయే కాలంలో ఐక్యంగా ఉండాలని, మనవాళ్ళు ఎవరో, ఇతరులు ఎవరో గుర్తించాలని పిలుపునిచ్చారు. మత్స్యకారుల గంగమ్మ, పెద్దమ్మ గుడులకు ప్రభుత్వ గ్రాంట్ పెట్టింది కూడా తానే అని తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం అనిమల్ హస్బెండరీ పార్లమెంటరీ కమిటీలో కూడా పోరాడుతున్నట్లు చెప్పారు. మనం కేవలం చేపలు పట్టే కూలీలుగా మిగిలిపోకుండా, మనమే పట్టాలి, అమ్మాలి, ఎగుమతి చేయాలి, వాల్యూ యాడెడ్ ప్రొడక్ట్స్ తయారు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ జాతి అభివృద్ధికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి, ఎంపీ డా. మల్లు రవి, నీలం మధు, సుధాకర్ రావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వం ఆమెకే వశం..

- మిస్ యూనివర్స్2025గా ఫాతిమా బాష్
- కిరీటాన్ని దక్కించుకున్న 25 ఏళ్ల అందాల భామ
- థాయ్‌లాండ్‌లోని నాంథబురిలో ఆట్టహాసంగా వేడుక
- మిస్ యూనివర్స్ విజేతకు 2,50,000 డాలర్ల ప్రైజ్ మనీ
- ఈ ఏడాది పోటీ థీమ్ 'ది పవర్ ఆఫ్ లవ్' (ప్రేమ శక్తి) పేరుతో



**థాయ్‌లాండ్:** ప్రపంచ సుందరీ పోటీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మిస్ యూనివర్స్ 2025 కిరీటాన్ని మెక్సికో గెలుచుకుంది. నవంబర్ 21, 2025న థాయ్‌లాండ్‌లోని నాంథబురిలో ఉన్న ఇంపాక్ట్ ఛాలెంజర్ హాల్‌లో జరిగిన ఈ తుది పోటీలో, ఫాతిమా బాష్ విశ్వ సుందరిగా కిరీటాన్ని ధరించారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు, భారతీయ కాలమానం ప్రకారం ఉదయం 6:30 గంటలకు ఈ పోటీలు ప్రారంభమయ్యాయి.

**టాప్ 30కే భారత్ పరిమితం..**

భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన మణికా విశ్వకర్మ గట్టి పోటీనిచ్చినప్పటికీ, టాప్ 30లో తన స్థానాన్ని పదిలం చేసుకోగలిగారు. అయితే, ఆమె ఆ తదుపరి రౌండ్‌లలోకి, అంటే టాప్ 12లోకి అడుగు పెట్టలేకపోయారు. దీంతో భారత్‌కు నాలుగో విశ్వ సుందరి కిరీటాన్ని తెచ్చిపెట్టాలన్న మణికా ప్రయత్నం ఫలించలేదు. ఈ ఏడాది పోటీ థీమ్ 'ది పవర్ ఆఫ్ లవ్' (ప్రేమ శక్తి) గా నిర్ణయించారు. ఇది ఐక్యత, సాధికారత, దృఢత్వం వంటి అంశాలపై దృష్టి సారించింది.

**విశ్వ సుందరి 2025 టాప్ 5 విజేతలు..**

విజేత ఫాతిమా బాష్‌తో పాటు, మిగిలిన టాప్ 5 స్థానాలను ఈ కింది సుందరీమణులు దక్కించుకున్నారు.

విజేత: మెక్సికో ఫాతిమా బాష్
1వ రన్నరప్: థాయ్‌లాండ్ ప్రవీణార్ సింగ్
2వ రన్నరప్: వెనిజులా స్టెఫానీ అబసాలి
3వ రన్నరప్: ఫిలిప్పీన్స్ అహ్తిసా మనాలో
4వ రన్నరప్: కోట్ డి'ఐవోర్ ఒలివియా యేస్

**ప్రైజ్ మనీ ఇదే..**

మిస్ యూనివర్స్ విజేతకు నగదు బహుమతి ఎంతనే వివరాలను ఆర్గనైజేషన్ వెల్లడించలేదు. అయితే, విశ్వసుందరి కిరీటం దక్కిన వారికి 2,50,000 డాలర్ల ప్రైజ్ మనీ ఇస్తారని పలు కథనాలు వెల్లడించాయి. దీంతో పాటు నెల నెలా 50వేల డాలర్ల వేతనం కూడా అందుతుంది. ఇక, అందాల రాణి ధరించే కిరీటం ధర 5 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.44కోట్లు) పైనే ఉంటుంది. విశ్వసుందరికి న్యూయార్క్ నగరంలో మిస్ యూనివర్స్ అపార్ట్‌మెంట్స్‌లో సంవత్సరం పాటు ఉచిత నివాస సౌకర్యం కల్పిస్తారు. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ విజేతకు ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్, సహాయకులతో కూడిన బృందాన్ని ఉచితంగా నియమిస్తుంది.

**వ్యక్తిగత జీవితం, విద్య..**

ఇక ఫాతిమా బాష్ ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటాన్ని గెలుచుకుని, ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఆమె నేపథ్యం, విద్యాభ్యాసం వివరాలు ఇక్కడ ఉన్నాయి. లాటిన్ టైమ్స్ ప్రకారం, ఫాతిమా బాష్ ఫెర్నాండెజ్ మెక్సికోలోని శాంటియాగో డి టియాపా ప్రాంతానికి చెందినవారు. ఆమె యూనివర్సిడాడ్ ఇబెరోఅమెరికానాలో ఫ్యాషన్ అండ్ అపెరెల్ డిజైన్ కోర్సును అభ్యసించారు. తరువాత, ఆమె మిలన్‌లో ఉన్న నువోవా అకాడెమియా డి బెల్లే ఆర్టిలో, అలాగే యూఎస్‌ఏలోని వెర్మోంట్‌లో ఉన్న లిండన్ ఇన్‌స్టిట్యూట్‌లో అదనపు ఉన్నత విద్యను పూర్తి చేశారు. 25 ఏళ్ల ఫాతిమా బాష్ తన పాఠశాల రోజుల్లో డిస్లెక్సియా, అటెన్షన్‌డెఫిసిట్/హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ వంటి సమస్యలతో పోరాడినట్లు బహిరంగంగా తెలిపారు. ఫాతిమా బాష్ స్వస్థలమైన మెక్సికోలోని టబాస్కో రాష్ట్రం నుంచి విశ్వ సుందరి పోటీల్లో అంతర్జాతీయంగా పాల్గొన్న మొదటి మహిళ ఈమే. అంతేకాకుండా, ఈ రాష్ట్రం తరఫున విశ్వ సుందరి కిరీటాన్ని గెలుచుకున్న మొట్టమొదటి వ్యక్తి కూడా ఈమే.


# రేవంత్ దూకుడు అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఏపీ నుండి విడిపోయిన ప్రధాన కారణాల్లో నీళ్ళు ఒకటి కాగా, ఇపుడు మళ్ళీ నీళ్ళలో నిప్పు రాజేసే కార్యక్రమం మొదలైంది. ఏపీ విభజన తర్వాత తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యతను దెబ్బతీస్తున్న అంశాల్లో జల వివాదాలు ఒకటి కాగా, కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టుల నిర్మాణం, నీటి వాడకం, సరిహద్దు సమస్యలు ఇలా చాలా ఉన్నాయి. వీటిలో తాజాగా కృష్ణాజలాల వాడకానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ ను ఆశ్రయించిన నేపథ్యంలో ఏపీ కూడా తన వాదన వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు విపక్ష వైసీపీ అధినేత వైఎస్ జగన్ శుక్రవారం లేఖ రాశారు. గతంలో కేసీఆర్, వైఎస్ జగన్ మధ్య సఖ్యత ఉంది. ఆ సమయంలో జగన్ రాయలసీమకు నీళ్ళు తరలించుకుపోయారన్న ఆరోపణ తెలంగాణ వర్గాల నుండి ఉండగా, ఇపుడు చంద్రబాబు, రేవంత్ రెడ్డిల మధ్య సఖ్యత ఉంది. దీనిని తెలంగాణ అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నదని లేఖ ద్వారా స్పష్టమవుతోంది. ఇటీవల బనకచర్ల అంశంలో కూడా ఏపీ వెనక్కుతగ్గింది.

**ఏపీకి అన్యాయం తప్పదు**

కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ ముందు జరిగే విచారణలో ఏపీ ప్రభుత్వం తన వాదనను వినిపించే అవకాశం ఉంటుందని, తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నదిలో 763 టీఎంసీల నీటిని కేటాయించాలనే తెలంగాణ ప్రభుత్వ డిమాండ్ నేపథ్యంలో ఇది చాలా ముఖ్యమైనదని జగన్ లేఖలో పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ఈ అభ్యర్థనను అంగీకరిస్తే, ఏపీకి తీవ్ర అన్యాయం తప్పదన్నారు. ఏపీ ప్రభుత్వం ఇప్పుడు ట్రైబ్యునల్ ముందు తన తుది వాదనలను సమర్పించి అన్యాయమైన పునర్విభజనను నిరోధించాలని జగన్ కోరారు. రాయలసీమ ప్రాజెక్టుల పట్ల టీడీపీ నిర్లక్ష్య వైఖరిని బాబుకు రాసిన లేఖలో జగన్ గుర్తుచేశారు. 1996లో చంద్రబాబు ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా కూడా



Y.S. JAGAN MOHAN REDDY
Ex-Chief Minister, Andhra Pradesh,
Leader, YSR Congress Legislature Party,
A.P. Legislative Assembly,
PRESIDENT, YSR CONGRESS PARTY.

Date: 19th November, 2025

Shri. Chandra babu Naidu garu,

Sub – Request to the Government to safeguard the interests of the people of the State in the light of the KWDT-II hearings.

I wish to bring to your attention the following points. It is quite distressing to note that the TDP coalition Government in the State of AP does not seem to have any sincerity in protecting the State's rights over the Krishna river waters. The coalition government is making fragile arguments on behalf of the State before the Krishna Water Disputes Tribunal (KWDT)-2, which was formed under the chairmanship of Justice Brijesh Kumar and comprising of Justice Rammohan Reddy and Justice S. Talapatra. The affidavit on behalf of the State of AP was filed by Anil Kumar (AK) Goyal as a witness before the tribunal. The lackluster response of Mr. AK Goyal, when he was being cross-examined by senior advocate Vaidyanathan on behalf of the Telangana government, demonstrates that the present State Government is not acting with utmost seriousness in protecting the State's rights over the Krishna river waters. It would not be out place to mention that, as per the extant legal framework the Bachawat Tribunal (KWDT-1) award is equivalent to a Supreme Court decree. Further, KWDT-2 itself opined that reviewing the award is illegal. Despite this, in accordance with the Additional Terms of Reference issued by the Central Government on October 6, 2023, the KWDT-2 is conducting a review of the Bachawat Tribunal (KWDT – I) Award on aspects pertaining to distribution of 811 TMC of net water (75 percent availability). KWDT-2 hearings took place from 23rd to 24th of September, 2025. It is widely reported that, in this hearing, Telangana Government made a demand for allocation of 763 TMC to Telangana State. If the Tribunal accedes to this request, the State of AP would be subjected to severe injustice. The Andhra

ఉన్నప్పుడే ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును 519.6 మీటర్ల నుండి 524.25 మీటర్లకు పెంచే పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఆ సమయంలో ఏపీలో ప్రతిపక్ష పార్టీలు, రైతులు ఈ పరిణామం ఉమ్మడి ఏపీ హక్కులను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళనలు చేసినా చంద్రబాబు పెడచెవిన పెట్టారన్నారు. టిడిపి ప్రభుత్వ వైఖరి కారణంగా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచడానికి కర్ణాటకకు అనుమతి ఇచ్చిందన్నారు. అలాగే 2014లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వం కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర హక్కుల్ని కూడా తెలంగాణకు వదులుకుందన్నారు. మళ్ళీ ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కుంటోందని జగన్ ఆరోపించారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. ఈ కీలక సమయంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రం పట్ల నిబద్ధతతో వ్యవహరించి, కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడాలని జగన్ కోరారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టిఎంసి నికర నీటిలో ఒక టిఎంసి అయినా కోల్పోయే పరిస్థితి తలెత్తినా, దానికి టిడిపి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

# సంక్షేమ పథకాల జాతర

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసిన నిధులలో రెండు కీలక పథకాలకు కేటాయింపులు ప్రముఖంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న రైతులకు భరోసా కల్పించేందుకు, సన్నధాన్యం రైతులకు బోనస్ అందించేందుకు ప్రభుత్వం ఏకంగా రూ. 200 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ బోనస్, రైతులు తాము పండించిన ధాన్యానికి అదనపు ధరను అందించి, వారి ఆర్థిక కష్టాలను కొంతమేర తీరుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వానికి అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. మరోవైపు, మహిళా ఓటర్లను సంతృప్తిపరిచే లక్ష్యంతో ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి ఎల్పీజీ పథకానికి గాను రూ. 60 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం కింద మహిళలకు రూ. 500 సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లు అందించనున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల నేపథ్యంలో, మహిళలకు వంట గ్యాస్‌పై సబ్సిడీ అందించడం అనేది గృహ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపి, తద్వారా మహిళా ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తుంది.

**మైనారిటీ సంక్షేమానికి ప్రాధాన్యత**

నిధుల కేటాయింపులో మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు అత్యధిక ప్రాధాన్యత లభించింది. మైనారిటీ వర్గాల విద్య, ఉపాధి, ఆర్థిక సాయం పథకాలకు ఏకంగా రూ. 220 కోట్లను కేటాయించారు. మొత్తం రూ. 480 కోట్ల ప్యాకేజీలో సగానికి దగ్గరగా ఈ వర్గానికే కేటాయించడం అనేది, మైనారిటీ వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియజేయడంతో పాటు, వారి సంపూర్ణ మద్దతును కూడగట్టుకునే ఎన్నికల వ్యూహాన్ని సూచిస్తోంది. ఈ భారీ కేటాయింపులు త్వరగా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు చేరుకునేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

**ఎన్నికల నేపథ్యంలో ప్రచార ప్రణాళిక**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, కేవలం నిధులు విడుదల చేసి సరిపెట్టకుండా, ఈ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలు, విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా ఈ ఆర్థిక సాయం, సబ్సిడీలను తమ విజయాలుగా ప్రచారం చేసుకుని, ఓటర్ల నుంచి మద్దతు పొందాలని అధికార పక్షం ఆశిస్తోంది. ఎన్నికల సమయానికి ఈ నిధుల పంపిణీ పూర్తి చేసి, ఈ పథకాల లబ్ధిని ప్రజలకు చేరేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ మూడు కీలక వర్గాలకు ఒకేసారి నిధులు విడుదల చేయడం వలన, స్థానిక ఎన్నికల్లో ఈ వర్గాల మద్దతు ప్రభుత్వానికి ఎంతమేర లభిస్తుందనేది రానున్న రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

# కట్టుకథల మాటున రక్తపాతం!

**దండకారణ్యంలో దారుణం**

- హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకమే
- విజయవాడలో బంధీ, మారేడుమిల్లిలో హత్యాకాండ
- ఫాసిస్ట్ ప్రభుత్వ దమనకాండకు నిదర్శనం
- చికిత్స కోసం వచ్చిన అగ్రనేతను పట్టుకుని క్రూర హత్య
- హిడ్మా, శంకర్ సహా 6గురిని కిరాతకంగా చంపారు
- నవంబర్ 23న దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు
- భగత్ సింగ్, అల్లూరి చరిత్రలకు తోడుగా హిడ్మా వీరగాథ
- పీడిత ప్రజల నాయకుడిపై విష ప్రచారం
- మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన



**ఖమ్మం బ్యూరో, మహా:**

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ విడుదల చేసిన ఒక అత్యంత సంచలనాత్మక పత్రికా ప్రకటన దేశవ్యాప్తంగా రాజకీయ, భద్రతా వర్గాలలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో జరిగినట్లు ప్రకటించిన ఎన్‌కౌంటర్లను ఈ కమిటీ ఖండించడమే కాక, వాటిని అత్యంత క్రూరమైన బూటకపు హత్యాకాండ గా అభివర్ణించింది. కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి అయిన కామ్రేడ్ మాడ్వి హిడ్మా , ఏఓబీ రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ శంకర్ సహా మొత్తం ఆరుగురు కీలక నాయకులను పోలీసులు చట్టవిరుద్ధంగా అదుపులోకి తీసుకుని, అమానుషంగా హత్య చేశారని కమిటీ నిప్పులు చెరిగింది. ఈ దారుణ చర్యలకు నిరసనగా నవంబర్ 23న దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటించాలని సీపీఐ (మావోయిస్టు) ప్రజలకు ఉద్విగ్నభరితమైన పిలుపునిచ్చింది.

**విజయవాడలో ద్రోహం, అడవిలో హత్యాకాండ**

పత్రికా ప్రకటనలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మొత్తం ఉదంతం వెనుక ఒక చీకటి కుట్ర దాగి ఉంది. కామ్రేడ్ హిడ్మా, తన సహచరి కామ్రేడ్ రాజే, మరికొంతమంది నాయకులతో కలిసి కేవలం చికిత్స నిమిత్తం నిరాయుధులుగా విజయవాడ నగరానికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో, లోపలి వ్యక్తుల ద్రోహం కారణంగా వారి కదలికలకు సంబంధించిన స్పష్టమైన సమాచారం పోలీసులకు చేరింది. కేంద్ర హోం మినిస్ట్రీ యొక్క ప్రత్యక్ష ఆదేశాల మేరకే ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) రంగంలోకి దిగింది. నవంబర్ 15వ తేదీన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, లొంగదీసుకునేందుకు ప్రయత్నించి విఫలమైన తర్వాత, అత్యంత క్రూరంగా హత్య చేశారు. ఈ హత్యలను కప్పిపుచ్చుకోవడానికి, అధికార యంత్రాంగం మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగిందని, ఆయుధాలు దొరికాయని, ఆరుగురు చనిపోయారని ప్రకటించడం అంతా పచ్చి అబద్ధాల కట్టుకథ అని కేంద్ర కమిటీ ధృవీకరించింది. ఇదే తరహాలో, ఏఓబీ రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ శంకర్ సహా మరికొంతమందిని కూడా పట్టుకుని హత్య చేసి, రంపచోడవరం ఏరియాలో ఎన్‌కౌంటర్ జరిగిందనే మరో కట్టుకథను అల్లారని కమిటీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది.

**ఫాసిజం నీడలో కార్పొరేట్ అజెండా**

ఈ దారుణ హత్యలు కేవలం వ్యక్తిగత కక్ష సాధింపులు కాదని, ప్రస్తుత దేశంలో ఆర్ఎస్ఎస్ - బీజేపీ మనువాదుల ఫాసిస్టు దమనకాండకు నిదర్శనమని మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటించింది. హత్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్న ఫాసిస్టు ప్రభుత్వం, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడటం కోసమే ఈ రక్తపాతాన్ని సృష్టిస్తోందని ఆరోపించింది. దేశ సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలన్నింటినీ విచ్ఛిన్నం చేయడానికే ఈ అణచివేత విధానాలను అనుసరిస్తున్నారని కమిటీ పేర్కొంది. ఎన్నికల కమిషన్ సైతం మోదీకి 'గోది' కమిషన్‌గా మారిపోయిందని, దేశంలో ప్రతిపక్షాల ఉనికిని సైతం తుడిచిపెట్టేందుకు కుట్ర జరుగుతోందని ప్రకటనలో ఘాటుగా విమర్శించారు.

## చెదరని వీరగాథ పీడిత ప్రజల నాయకుడు హిడ్మా

బూటకపు హత్యలకు గురైన కామ్రేడ్ హిడ్మాకు, చివరి వరకు ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టిన కామ్రేడ్ శంకర్, కామ్రేడ్ రాజే, కామ్రేడ్ చైతు, కామ్రేడ్ కమూ, కామ్రేడ్ మల్లాల్, కామ్రేడ్ దేవేలకు సీపీఐ (మావోయిస్టు) శిరస్సు వంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటించింది. చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించిన హిడ్మా, దండకారణ్య ఉద్యమంలో అంచలంచెలుగా ఎదిగారు. చిన్న వయసులోనే బాసగూడ దళంలో చేరి, మిలిటరీ రంగంలో అపారమైన అనుభవాన్ని గడించారు. మిలిటరీ చర్యలకు మెరుగైన పథక రచనలు చేసి, వందలాది ఆయుధాలను స్వాధీనం చేసుకుని పీఎల్జీఏను సాయుధం చేయడంలో ఆయన పాత్ర అద్వితీయమైనది. ఆయన నాయకత్వంలోనే దక్షిణ సబ్ జోన్‌లో 'జనతన సర్కార్లు' నిర్మాణమయ్యాయి. పాలకవర్గ మీడియా హిడ్మాను ఎంతగా దుర్మార్గుడిగా చిత్రీకరించడానికి ప్రయత్నించినా, ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోనిదని కేంద్ర కమిటీ ఉద్ఘాటించింది. భగత్ సింగ్, కొమురం భీం, అల్లూరి సీతారామరాజుల చరిత్ర లాగానే, హిడ్మా చరిత్ర కూడా భారత విప్లవోద్యమంలో చెరగని ముద్ర వేస్తుందని, ఆయన కేవలం ఆదివాసీ సముదాయానికి మాత్రమే కాక, పీడిత ప్రజలందరికీ నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారని ప్రకటన ముగించింది. ఆయన కొనసాగించిన విప్లవ సాంప్రదాయాలను, స్ఫూర్తిని నింపుకుని ఉద్యమాన్ని కొనసాగిస్తామని కేంద్ర కమిటీ శపథం చేసింది.

# కేటీఆర్‌కు పచ్చకామెర్లు

- బీఆర్ఎస్ హయాంలో సాగింది ఫాం హౌస్ పాలనే
- ఎన్నికల్లో ఓడినా కేటీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదు
- కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పచ్చ కామెర్లు వచ్చిన వారికి లోకం అంతా పచ్చగానే కనపడుతోందని.. కేటీఆర్‌కి కూడా అలాగే ఉందని విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఫాం హౌస్ పాలన తప్పా.. ప్రజాపాలన ఎక్కడా చేయలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో కేబినెట్‌లో అన్ని నిర్ణయాలు జరుగుతాయని కేటీఆర్ గతంలో ఒప్పుకున్నారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబాన్ని విమర్శించడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. రేవంత్‌రెడ్డి కుటుంబంలో ఎంతమంది తమ ప్రభుత్వంలో ఉన్నారో కేటీఆర్ చెప్పాలని సవాల్ విసిరారు. కేటీఆర్ లాగా ఇంట్లో ఉన్నోళ్లందరికీ రాజకీయ పదవులను తమ ప్రభుత్వంలో ఇవ్వలేదని స్పష్టం చేశారు. కేటీఆర్ పదేళ్లు ఏం చేశారని, తెలంగాణకు తీసుకువచ్చిన పెట్టుబడులు ఏమయ్యాయని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ అండ్ కో తెలంగాణకు మంచి చేయరని... తాము చేస్తుంటే అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. వ్యాపారవేత్తలను కేటీఆర్ బెదిరించారని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని ఓడగొట్టినా కేటీఆర్‌కు బుద్ధి మారలేదని ఎద్దేవా చేశారు. చివరికి జూబ్లీహిల్స్‌లో ఓడగొట్టినా కేటీఆర్ మారడం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# కేటీఆర్.. అసత్యాలు చెప్పడం మానండి

(మొదటిపేజీ తరువాయి)

తమ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారని, మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోందని స్పష్టం చేశారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా కేటీఆర్ మాట్లాడుతున్నారని, 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నామని, భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నామని తెలిపారు.

**నూతన పాలసీ విధానం చట్టబద్ధంగా జరుగుతుంది..**

పెట్టుబడులు రావాలనే లక్ష్యంతోనే తమ ప్రభుత్వం రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటుందని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ అయ్యాయని, పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నామని గుర్తు చేశారు. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారని, వారు ప్రభుత్వంలో లేరని, ఆధారాలు ఉంటే చెప్పాలని, చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచనగా కనిపిస్తోందని మంత్రి విమర్శించారు. ఇంపాక్ట్ ఫీజు, కన్వర్షన్ ఫీజు విషయంలో 80 అడుగుల కంటే తక్కువ ఉన్న పరిశ్రమ భూములపై 30 శాతం, 50 శాతం నిర్ణయం చేశామని తెలిపారు. పరిశ్రమలను ప్రోత్సహించాలనే దృఢ సంకల్పంతో ఉన్న ప్రభుత్వం, టీజీఐపాస్ ద్వారా మొదట 20 శాతం, మిగిలిన 80 శాతం తర్వాత చెల్లించే విధానాన్ని అమలు చేస్తుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యాచరణ చేపడుతున్నామని, నూతన పాలసీ విధానం చట్టబద్ధంగా జరుగుతుందని, దరఖాస్తుదారులు ఆరు నెలల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి వివరించారు.



## నేడు పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు

### డెడికేషన్ కమిషన్ నివేదికకు మంత్రివర్గం ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ పంచాయతీరాజ్ శాఖ రేపు జీవో జారీ చేయనుంది. పంచాయతీలు, వార్డులలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ శనివారం పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయిస్తారు. రేపు, ఎల్లుండి జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్ల కేటాయింపు తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది.




ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ నెల 24న రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసి, విచారణ ముగించాలని కోరనుంది. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది.

# నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ సర్కార్ చేయదు

- దానంతో రాజీనామా చేయిస్తారు
- జీహెచ్ఎంసి ఎన్నికల తర్వాతే ఖైరతాబాద్ బైపోల్
- చిట్ చాట్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, మహా:** "చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఫార్ములాఈ కార్ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసు. నన్ను అరెస్టు చేసే ధైర్యం రేవంత్ చేయరు. దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారు. దానంతో రాజీనామా చేయిస్తామని మా వాళ్లతో అన్నారు. అనర్హత వేటు పడితే పరువు పోతోందని రాజీనామాకు అవకాశం ఇస్తున్నారు. సాంకేతికత సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ఉందేమోనని చూస్తున్నారు." అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ లో మీడియాతో చిట్ చాట్ చేసిన ఆయన ముందుగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు జరిగే అవకాశం కనబడుతోందని, ఆ తర్వాతే ఖైరతాబాద్ జరగవచ్చన్నారు. ఫార్ములాఈ కార్ కేసుపై ఇప్పటికే 100 సార్లు చెప్పాను ఏ తప్పు చేయలేదు, లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమేనని చెప్పారు.

**హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం**

9,300 ఎకరాల్లో భూ కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కేటీఆర్ ఆరోపణలు చేశారు. రూ.5 లక్షల కోట్ల విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కేబినెట్ భేటీలో తెరలేపిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుచరులకు, బంధువులకు ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహించారు. హైదరాబాద్‌లో భూములు ఉన్న చోట రేవంత్‌రెడ్డి ముఠా వాలిపోతోందని చెప్పారు. రేవంత్ రెడ్డి ఆలోచనలు మొత్తం భూములపైనే ఉంటాయని కేటీఆర్ తెలిపారు. ప్రైవేటు పరిశ్రమల పెట్టుబడి కోసం వచ్చినప్పుడు రాయితీగా భూకేటాయింపు జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. ఉపాధి కోసం రాయితీలు ఇచ్చి భూకేటాయింపు జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోతోందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో భారీగా భూకుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బాలానగర్, నాచారం, జీడిమెట్లలో భూ కుంభకోణం జరుగుతోందని వివరించారు.

# హీరా గోల్డ్ నౌహీరా షేక్‌కు బిగ్ షాక్

- రూ.19.64 కోట్ల విలువైన స్థిరాస్తి ఈడీ వేలం
- వేలం మొత్తాన్ని హీరా గ్రూప్ బాధితులకు అందజేత
- రూ.5,978 కోట్ల మోసం చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు



**హైదరాబాద్, మహా:** హీరా గోల్డ్ నౌహీరా షేక్ కు ఈడీ అధికారులు షాక్ ఇచ్చారు. ఆమెకు సంబంధించిన ఆస్తులను వేలం వేశారు అధికారులు. ఆస్తుల వేలం ద్వారా వచ్చిన రూ.19 కోట్ల పై చిలుకు నగదుని బాధితులకు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలోనే హీరా గోల్డ్ ఆస్తుల వేలం ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రకటించారు. అటాచ్ చేసిన ఆస్తులను అమ్మకానికి పెడుతున్నట్లు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రూ.5900 కోట్లు వసూలు చేసి నౌహీరా షేక్ బిచాన ఎత్తివేశారు. ఆమెపై దేశవ్యాప్తంగా 52కు పైగా కేసులు నమోదు చేశారు. ఈడీ వేలంలో నౌహీరా షేక్ ఆస్తి రూ.19.64 కోట్లను వేలంపాట ద్వారా వచ్చే మొత్తాన్ని మోసపోయిన బాధితులకు లేదా పెట్టుబడిదారులకు తిరిగి వినియోగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

**రూ.5,978 కోట్ల మోసంచేసినట్లు గుర్తించారు**

కాగా, నౌహీరా షేక్ కేసులో కీలక పురోగతి నమోదైంది. ఆమెకు సంబంధించిన ఒక స్థిరాస్తిని రూ.19.64 కోట్లకు విజయవంతంగా వేలం వేశారు ఈడీ అధికారులు. శుక్రవారం ఆ ఆస్తి రిజిస్ట్రేషన్‌ను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి చేశారు. ఈ ఆస్తిని ఈడీ 16.08.2019న తాత్కాలిక అటాచ్‌మెంట్ ఆర్డర్ ద్వారా స్వాధీనం చేసుకుంది. నౌహీరా షేక్ రూ.5,978 కోట్ల మోసం చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. నౌహీరా షేక్, ఇతరులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళతో సహా పలు రాష్ట్రాల్లోని పోలీసు అధికారులు కేసులు నమోదు చేసి.. అనేక ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ- 2002) కింద దర్యాప్తు చేపట్టింది. పోలీసుల దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం.. నౌహీరా షేక్, ఇతరులు ప్రజలను ఓ పథకం ప్రకారం నమ్మించి రూ. 5,978 కోట్లకు పైగా పెట్టుబడులు సేకరించారు. సంవత్సరానికి 36శాతం కంటే ఎక్కువ లాభం ఇస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. కానీ బాధితులకు మూలధనం కూడా తిరిగి ఇవ్వకుండా భారీ మోసం చేశారు. రూ.428 కోట్ల విలువైన ఆస్తులు ఇప్పటికే అటాచ్ చేసింది.

# బీసీ జాతి కోసమే నా పోరాటం



- ఏ నాయకుడికి లొంగకుండా ఉద్యమాలు చేస్తున్నా
- రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** నా చివరి రక్తం బొట్టు ఉన్నంత వరకు బీసీ జాతి కోసం పోరాటం చేస్తానని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. బీసీ ఐకాస చైర్మన్ ఆర్. కృష్ణయ్య అధ్యక్షతన లక్డీకాపూల్ లోని ఓ హోటల్ లో భవిష్యత్ కార్యాచరణపై బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సినీ దర్శకుడు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి, దర్శకుడు శంకర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ తో పాటు పలువురు బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. పదవులు, ప్రయోజనాల కోసం ఏ రాజకీయ నాయకుడికి లొంగకుండా కేవలం భవిష్యత్తు బీసీ తరాల కోసం ఉద్యమాలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఉద్యమంలో అనేక లోటుపాట్లు, వెన్నుపోటులు, కుట్రలు, పేదరికం, బలహీనతలు ఉంటాయని, వాటిని ఎదుర్కొంటూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తున్నట్లు తెలంగాణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మరిందో... బీసీ ఉద్యమం మారాలని.. అప్పుడే 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా కూడా దేశవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. బీసీలు అంటే బ్యాక్ బోన్ ఆఫ్ ఇండియా అని, బ్రిటిష్ కాలం నుండి బీసీ లపై కుట్రలు ఇంకా జరుగుతున్నాయని, సినీ దర్శక నిర్మాతల ఆర్ నారాయణ మూర్తి ఆరోపించారు.

# బిట్ కాయిన్... మళ్లీ ఢమాల్!

**ఏడు నెలల కనిష్టానికి బిట్‌కాయిన్**



**మహా:** ప్రపంచంలోనే అతి పెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ భారీగా పతనమైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో డిజిటల్ ఆస్తులలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో, శుక్రవారం బిట్‌కాయిన్ ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ట్రేడింగ్ సెషన్‌లో బిట్‌కాయిన్ 7.18 శాతం నష్టపోయి 85,966.75 డాలర్ల వద్దకు చేరింది. దీని మార్కెట్ విలువ 1.71 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, గత 24 గంటల్లో ట్రేడింగ్ వాల్యూమ్ 94 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇదే బాటలో, రెండో అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన ఈథర్ కూడా 7.92 శాతం తగ్గి 2,797.50 డాలర్లకు పడిపోయింది. అమెరికా ఆర్థిక పరిస్థితులపై నెలకొన్న అనిశ్చితి కారణంగానే క్రిప్టో మార్కెట్ పతనమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఉద్యోగాల డేటాలో నిరుద్యోగం ఊహించిన దానికంటే ఎక్కువగా నమోదు కావడం ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచింది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై అనుమానాలు మొదలయ్యాయి. ఫలితంగా, పెట్టుబడిదారులు క్రిప్టో కరెన్సీల వంటి ప్రమాదకర ఆస్తుల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఈ వారం మొత్తం బిట్‌కాయిన్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మంగళవారం ఏడు నెలల్లో తొలిసారిగా 90,000 డాలర్ల దిగువకు పడిపోయింది. ఈ తాజా పతనంతో 2025లో సాధించిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. అక్టోబర్‌లో నమోదైన 1,26,000 డాలర్ల గరిష్ఠ స్థాయి నుంచి బిట్‌కాయిన్ ఇప్పుడు దాదాపు 30 శాతం నష్టపోయింది. అదేవిధంగా, ఈథర్ కూడా ఆగస్టులో ఉన్న 4,955 డాలర్ల గరిష్ఠ స్థాయి నుంచి సుమారు 40 శాతం పతనమైంది.

# ఇదో దుర్మార్గ ప్రభుత్వం

- రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా?
- 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది?
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్



**హైదరాబాద్, మహా:** ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి? రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి? ధరణి పేరు మార్చి తెచ్చిన భూభారతి ఏమైంది? రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నలు కురిపించారు. నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారమవడం లేదు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వక పోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. "ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100 శాతం కాపాడతాం" అని ఎన్నికల ప్రచారంలో అదరగొట్టిన రేవంత్ రెడ్డికి మీ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది రేవంత్ రెడ్డి? అని నిలదీశారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి మీరు రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం మీది. ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## మావోయిస్టు నాయకుల ఎన్ కౌంటర్లపై నల్ల జెండలతో నిరసన



**ఆలేరు, మహా:** మావోయిస్టు పార్టీ నాయకులు మాడవి హిడ్మాతో పాటు పలువురు నాయకుల ఎన్ కౌంటర్లను నిరసిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఎం ఎల్ న్యూడెమాక్రసీ ,సిఐ,సిపిఎం పార్టీల ఆద్వర్యంలో శుక్రవారం నల్ల జెండాలతో ధర్నా చేశారు... బిజెపి కేంద్ర ప్రభుత్వం మోదీ ,అమిత్ షా లు డెడ్ లైన్ పెట్టి మావోయిస్టు నాయకులను బూటకపు ఏన్ కౌంటర్లు చేస్తున్నారని ఎం ఎల్ పార్టీ నాయకులు ఆరోపించారు కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటి వరకు చేసిన అన్ని ఎన్ కౌంటర్లపై న్యాయ విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ జనార్ధన్, డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్,AIKMS జిల్లా అధ్యక్షులు కల్లెపు అడవయ్య, టంగుటూరు మాజీ సర్పంచ్ సమరసింహారెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేష్, సిపిఎం మండల నాయకులు పిక్క గణేష్, ఇక్కిరి శ్రీనివాస్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## వాళ్లిద్దరిని వదల

**హరీశ్, జగదీశ్ రెడ్డి టార్గెట్ గా కవిత కామెంట్స్**

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆమె పర్యటనలో భాగంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఓటమికి దారితీసిన పలు అంతర్గత కారణాలపై దృష్టి సారించారు. కవిత చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలోని అంతర్గత విభేదాలను మరోసారి బట్టబయలు చేశాయి. అధికారంలో ఉన్నప్పుడు వారికి అప్పగించిన బాధ్యతలను సరిగా నిర్వర్తించడంలో వారు విఫలమయ్యారని కవిత ఆరోపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ కష్టకాలంలో కొందరు నాయకులు అనుసరిస్తున్న తీరుపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "వాళ్లిద్దరిని వదల" అంటూ కవిత నేరుగా హెచ్చరించడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఓటమి తర్వాత బీఆర్ఎస్‌లో నెలకొన్న సంక్షోభం, నాయకుల పరస్పర విమర్శలు పార్టీ భవిష్యత్తుపై ప్రశ్నార్థకం వేస్తున్నాయి. ఈ వ్యవహారంపై వారు ఎలా స్పందిస్తారని హాట్ టాపిక్‌గా మారింది.

## గుండ్లగూడెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ రోడ్డు నిర్మించాలి

**బిజెపి రిలే నిరాహారదీక్ష**




**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మించాలని బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే గేటు దగ్గర టెంట్ వేసి రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. గేటుతో గుండ్లగూడెం, శివలాల్ తాండ, పటేలు గూడెం, శ్రీనివాస్ పురం గ్రామాలకు చెందిన సూమారు ఎనిమిది వేల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దీక్ష లో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూర్ అశోక్ గౌడ్ఆ వేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉద్యో గులు,రైతులు సామాన్య ప్రజల అవసరాల కోసం మండల కేంద్రంతో పాటు సికింద్రాబాద్ వివిధ ప్రాంతాలకు వెళ్లుతుంటారని ఆలేరు ఎమ్మెల్యే, భువనగిరి ఎంపిలు దృష్టి పెట్టి గుండ్లగూడెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మించాలని తాము కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. ఈ రోజు నుండి మూడు రోజుల పాటు పలు గ్రామాల ప్రజలతో కలిసి రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తామని అశోక్ గౌడ్ తెలిపారు.. మొదటి రోజు దీక్షలో బిజెపి మండల అధ్యక్షులు పూజారి కుమార స్వామి,జిల్లా, మండల నాయకులు తునికి దశరథ, బిఆర్ఎస్ నాయకులుగుండ్ల గూడెం మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు విజయ్ లు దీక్షలకు మద్దతు తెలిపారు, బిజెపి నాయకులు కామిటి కారి కృష్ణ, మహేందర్ గౌడ్,లక్ష్మీ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## బిజెపి, కాంగ్రెస్ రెండు పార్టీల కుట్రలో భాగమే కేటిఆర్‌పై కేసులు

**మాజీ ఎమ్మెల్యే, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రెస్ మీట్**




**ఆలేరు, మహా:** భారతదేశంలో ఉన్న జాతీయ పార్టీలు కాంగ్రెస్ బీజేపీ పార్టీలు ప్రాంతీయ పార్టీలు ఎదగకుండా చూడాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితా మహేందర్ రెడ్డి అన్నారు.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు గెస్ట్ హౌస్ లో శుక్రవారం ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుట్రలో భాగంగానే అటు బిజెపి ఇటు కాంగ్రెస్ ప్రభుత్వాలు ముఖ్యంగా నరేంద్ర మోడీ ఉత్తర భారతదేశంలో ప్రాంతీయ పార్టీలన్నింటిని బొంద పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో కేటీఆర్ ను కూడా ఇబ్బంది పెట్టి రాజకీయంగా ఎదుర్కొనడానికి దమ్ములేక కుట్రతోనే బిజెపి పార్టీ ఒకవైపు కాంగ్రెస్ పార్టీ మరోవైపు రెండు జాతీయ పార్టీలు చూస్తున్నారని ఆమె ఆరోపించారు గతంలో ఎంక్వైరీ లన్నీ జరిగిన తర్వాత ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ఈ ఎన్నికలలో కేటీఆర్ చాలా ఉత్సాహంగా ఆ పార్టీ కార్యనిర్వహణాధికారి అధ్యక్షుడిగా అదే విధంగా అటు హరీష్ రావు తెలంగాణ రాష్ట్రం మొతం తిరుగుతూ రైతుల కష్టాలు గురించి అవగాహన చేసుకుంటూ వాళ్లకు మద్దతు తెలుపుతూ జిల్లాలో తిరుగుతూ ఉంటే స్థానిక సంస్థల్లో ఒడిపోతామనే భయంతో రేవంత్ రెడ్డి ఇలా ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నాడన్నారు. గవర్నర్ పర్మిషన్ తీసుకొని కేసు పెట్టాలని ప్రయత్నం చూస్తున్నారు ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని విధాల ఇబ్బంది పెట్టాలని చూసినా బిఆర్ఎస్ పార్టీ పాలనలో వీసమెత్తు కూడా తప్పు జరగలేదు గతంలో కూడా కేటీఆర్ చాలా సార్లు స్పష్టంగా మీడియా ముందుకు వచ్చి చెప్పారన్నారు హైదరాబాద్లో ఈ ఫార్ములా రేస్ పెట్టడం వల్ల ఏడు వందల కోట్ల పెట్టుబడులు మనకు స్పష్టంగా చూపినాడు... ఈ రోజు కావాలనే కక్షపూరితంగా కేటీఆర్ ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. మీరు ఏ కేసులు పెట్టినా ఎంత గింజుకున్నా మీరు ఏం చేసినా అందులో దొరికేది ఏమిలేదు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు కేటీఆర్ ను బద్నాం చేయాలనే ఉద్దేశంతో చేస్తున్నరని అన్నారు. కావాలనే కవితను కూడా 5 నెల 11 రోజుల పాటు జైల్లో ఉంచారు... ఈ విధంగా కెసిఆర్ ను కేటీఆర్ టార్గెట్ చేసుకుంటూ బిఆర్ఎస్ పతనాన్ని కోరుకుంటున్నారు. వాళ్లే ఎంతగా కోరుకుంటున్నారో రేపు కచ్చితంగా రాబోయే ఎన్నికలలో బి ఆర్ ఎస్ పార్టీ తగిన బుద్ధి చెబుతుంది అన్నారు. తప్పకుండా రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాల్సి వచ్చే కాలం వస్తుందన్నారు అన్నారు. ఈ రాష్ట్రానికి ఒక గుర్తింపు తీసుకొచ్చిన ఐటీ శాఖ మంత్రి కే టీ ఆర్ అన్ని రంగాలలో మరి తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానం లోనిలిపారు. తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. తప్పకుండా కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కచ్చితంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్త టిఆర్ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టబోతున్నరని ఆమె జోస్యం చెప్పారు అన్నారు.

# శ్రమ సంస్కృతిలో నవశకం

## కొత్త లేబర్ కోడ్స్ అమలు!

- కార్మికులకు అభయం, సామాజిక భద్రతకు చట్టబద్ధత
- 29 పాత చట్టాల స్థానంలో 4 సమగ్ర కోడ్స్



దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలిచే కార్మిక శక్తికి సంపూర్ణ భద్రత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక సంస్కరణలకు నాంది పలికింది. కార్మికుల హక్కులను, వారి సామాజిక భద్రతను బలోపేతం చేసే ఉద్దేశంతో తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్స్ శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా అధికారికంగా అమల్లోకి వచ్చాయి. ఉమ్మడి కార్మిక చట్టాల చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలవనుంది. ఒకప్పుడు అమల్లో ఉన్న 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు సమగ్రమైన, ఆధునిక కోడ్‌లను ప్రభుత్వం తీసుకువచ్చింది. నేటి నుంచి అమలులోకి వచ్చిన కోడ్‌లలో ముఖ్యంగా కోడ్ ఆన్ వేజెస్ (2019), ఉద్యోగ, ఉపాధి సంబంధాలను క్రమబద్ధీకరించే ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ (2020), సర్వవ్యాప్త సామాజిక భద్రతను లక్ష్యంగా చేసుకున్న కోడ్ ఆఫ్ సోషల్ సెక్యూరిటీ (2020), పని ప్రదేశాలలో భద్రత, ఆరోగ్యాన్ని నిర్దేశించే ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (2020) ఉన్నాయి.

**వేతనాలు, సమానత్వానికి భరోసా**

ఈ కోడ్స్ అమలుతో కార్మికుల ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడుతుంది. ఇకపై, ప్రైవేటు, ప్రభుత్వ రంగాలతో సంబంధం లేకుండా, ప్రతి ఉద్యోగికి వేతనాలు ప్రతి నెలా 7వ తేదీలోపే చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాక, లింగ వివక్షకు తావులేకుండా పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు తప్పనిసరి. మహిళలు రాత్రి షిఫ్టుల్లో పనిచేసేందుకు సైతం చట్టబద్ధంగా అవకాశం లభించింది. ఓవర్ టైం పనిచేసే కార్మికులకు చెల్లింపులు రెట్టింపు చేయాలని చట్టం స్పష్టంగా నిర్దేశిస్తోంది. ఫిక్స్డ్ టర్మ్ ఉద్యోగులు సైతం ఒక సంవత్సరం సర్వీసు తర్వాత గ్రాట్యుటీకి అర్హత సాధించడం ఒక శుభ పరిణామం.

**గిగ్ వర్కర్లకు రక్షణ కవచం**

నేటి డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన అసంఘటిత రంగ కార్మికులు, ముఖ్యంగా గిగ్ వర్కర్లు మరియు ప్లాట్‌ఫామ్ వర్కర్లకు ఈ సంస్కరణలు రక్షణ కవచాన్ని అందిస్తున్నాయి. తొలిసారిగా వీరికి చట్టబద్ధమైన గుర్తింపు లభించడంతో పాటు, పీఎఫ్, ఈఎస్ఐసీ, ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా పథకాలు వర్తిస్తాయి. ఈ చర్య దేశంలోని కోట్లాది మంది అసంఘటిత కార్మికుల భవిష్యత్తుకు భద్రతను చేకూరుస్తుంది.

**ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం**

పని ప్రదేశంలో ఆరోగ్య భద్రతకు పెద్ద పీట వేశారు. ప్రమాదకర రంగాల్లో పనిచేసే ప్రతి కార్మికుడికి నూటికి నూరు శాతం ఆరోగ్య భద్రత కల్పించాల్సిన బాధ్యత సంస్థలపై ఉంటుంది. దీంతో పాటు, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ప్రతి సంవత్సరం ఉచిత హెల్త్ చెకప్ తప్పనిసరి చేస్తూ చట్టం ఆదేశించింది. ఈ సమగ్రమైన కోడ్స్ అమలు దేశంలో వ్యాపారాలకు సులభతరం చేయడంతో పాటు, కార్మికుల శ్రేయస్సు, ఆరోగ్యం, మరియు హక్కులకు గట్టి పునాది వేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కుట్ర రాజకీయాలతో ఆరోపణలు

- రచ్చబండ దగ్గర బహిరంగచర్చకు మేము సిద్ధం మీరు సిద్ధమా?
- బుర్ర నరసింహ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వలిగొండ, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఆరూరు గ్రామంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర నరసింహ మాట్లాడుతూ... కుట్ర రాజకీయాలతో నా పైన చేసిన ఆరోపణలు అవాస్తమని ఆయన అన్నారు. చిట్టెడి జనార్దన్ రెడ్డి ఆరోపణల పైన రచ్చబండ దగ్గర చర్చకు మేము సిద్ధం మీరు సిద్ధమా , టైం మీరన్న చెప్పండి మేమైనా చెప్తాము దేనికైనా మేము సిద్ధమే ప్రభుత్వ భూమి ఎవ్వరి ఆధీనంలో ఉన్న అధికారుల సమక్షంలో కొలతలు వేసి తేలిన వారు వెంటనే గ్రామపంచాయతీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఉపసర్పంచ్ సుక్క ముత్యాలు మాట్లాడుతూ...సీఎన్ రెడ్డి పేద రైతుల దగ్గర కౌలుకు తీసుకున్నానని అంటున్న మాట ఎంతవరకు సమంజసమని భూస్వామికి కౌలు ఎందుకని అది కౌలు కాదని అది కబ్జా అని ఆయన అన్నారు. . కబ్జాలో ఉన్న భూమిని అధికారులు తక్షణమే విచారణ చేసి పేద రైతులకు పంచి న్యాయం చేయాలని కోరారు. భాగ్యమ్మ చేసిన ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదు అని బొలుగుల రాజు, బొలుగుల జ్యోతి విలేకరుల సమావేశంలో ఖండించారు. బోలుగుల భాగ్యమ్మ ఏకపక్షంగా బుర్ర నరసింహపై ఆరోపణ చేయడం సరైనది కాదని భాగ్యమ్మ మేము ఇరువర్గాలు కలిసి బుర్ర నరసింహ దగ్గర పాసు పుస్తకాలు పెట్టిన మాట వాస్తవమే అని కానీ ఇరు వర్గాల అంగీకారంతో పాసుబుక్కులు ఇవ్వడానికి నరసింహ సిద్ధంగా ఉన్నాడని కానీ భూమి పంచాయతీ పెండింగ్లో ఉన్నందున సమస్యకు పరిష్కారం దొరకలేదన్నారు. ఈ కార్యక్రమంలో కొడితల కరుణాకర్, బండార్ మైపాల్ రెడ్డి, పిట్టల సుధాకర్ కొప్పుల బాలరాజ్ బుర్ర మల్లేష్ బండారు చిన్న నరసింహారెడ్డి, పెంటయ్య, మర్రి ముత్యాలు, పోలేపాక నరసింహ, కసరబోయిన నరసింహ, బుర్ర శ్రీశైలం, క్యాథరి నరేష్ , చిలుకలమర్రి అంజయ్య తదితరులు పాల్గొన్నారు




**ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**ఆత్మకూరు (ఎం), మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం నాడు తహశీల్దార్ కార్యాలయంలో నమూనా ఇందిరమ్మ ఇల్లుగృహప్రవేశంలో,అదేవిధంగా..మండలకేంద్రంలోని కందాడి ఇందిరమ్మ లక్ష్మారెడ్డి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం వారికి యటా పొట్టేలు,పట్టుబట్టలు అందజేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్రూమ్ ఇస్తామని మోసంపు మాటలు చెప్పి ఇవ్వలేదన్నారు.కానీ ఈ ప్రజాపాలన ప్రభుత్వం లో రేవంత్ రెడ్డి, గారి బీర్ల అయిలయ్య గారి సహకారం తో ఇందిరమ్మ ఇల్లు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# జనవరి 9కి రెబల్ సాంగ్ రిలీజ్

డార్లింగ్ ప్రభాస్ వరుస సినిమాలు చేస్తున్నాడు. హను రాఘవపూడితో 'ఫౌజీ', సందీప్‌రెడ్డి వంగాతో 'స్పిరిట్', నాగ్ అశ్విన్‌తో 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్, ప్రశాంత్ నీల్‌తో 'సలార్ 2', మారుతితో 'ది రాజాసాబ్' సినిమాలు చేసుకుంటూ పోతున్నాడు. వీటిలో ది రాజాసాబ్ ఈ ఏడాది డిసెంబర్‌లో రిలీజవుతుందని మొదట్లో ప్రకటించారు.


### ఫస్ట్ సాంగ్

కానీ, పలు కారణాల రీత్యా దాన్ని వాయిదా వేశారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ది రాజాసాబ్ నుంచి ఇప్పటివరకు టీజర్, ట్రైలర్ మాత్రమే చూశారు. ఇప్పుడు ఫస్ట్ సాంగ్ రాబోతుందని అప్‌డేట్ వదిలారు. నవంబర్ 23న రెబల్ సాంగ్ రిలీజ్ కానుందని సోషల్ మీడియాలో వెల్లడించారు


### విజిల్ కొట్టించేలా..

ఈ పాట మీతో విజిల్ కొట్టించేలా ఉంటుందంటూ ప్రభాస్ పోస్టర్ కూడా షేర్ చేశారు. అందులో ప్రభాస్ ఫుల్ ఎనర్జీతో అదిరిపోయే స్టెప్పులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో ఈ పాట కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ది రాజా సాబ్ మూవీ విషయానికి వస్తే ఇందులో నిధి అగర్వాల్, మాళవికా మోహన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నాడు.

# నాగ చైతన్య మైథలాజికల్ థ్రిల్లర్..



తండేల్ సూపర్ హిట్ తర్వాత నాగచైతన్య సరికొత్త మైథలాజికల్ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు. ఈ మూవీకి విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. చైతూ కెరీర్‌లో 24వ చిత్రంగా రానున్న ఈ సినిమాను ఎన్‌సీ24 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో చైతూ సరసన సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గాల కనిపించనుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ని ఈ నెల 23న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మూవీ మేకింగ్ వీడియోను షేర్ చేశారు. ఈ వీడియో నాగచైతన్య అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బీవీఎస్‌ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.



# రాహేలు వీడియో సాంగ్.. గ్లామర్‌గా హనీ రోజ్

మలయాళ నటి హనీరోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'రాహేలు'.. డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా రోమాంటిక్ సాంగ్‌ను విడుదల చేశారు. దర్శకుడు ఆనందిని బాలా రివేంజ్ డ్రామాగా తెరకెక్కించిన ఈ మూవీలో మలయాళ ప్రముఖ నటులు రోషన్ బషీర్, రాధికా రాధాకృష్ణన్ కీలక పాత్రలో నటించారు. 'వీరసింహారెడ్డి' సినిమాతో బాగా పాపులర్ అయిన హనీరోజ్ .. చాలారోజుల తర్వాత సరికొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను మెప్పించగా తాజాగా విడుదలైన సాంగ్ హనీ గ్లామర్‌తో హీట్ పెంచేసింది.

# ఆ ప్రేమ నాకు ఇంకా కావాలి : భాగ్యశ్రీ

"నేను నార్త్ నుంచి సౌత్‌కి వచ్చాను. ఇక్కడ ఒక స్టార్ హీరోని ఫ్యాన్స్ ఎంత గొప్పగా ఆరాధిస్తారో, ప్రేమిస్తారో చూశాను. అదో గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా, పరిచయం లేకుండా ఒక వ్యక్తిని ప్రేక్షకులు అంతలా ఎలా అభిమానిస్తారు? అనిపించేది. 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కథను పి. మహేశ్‌బాబు చెప్పినప్పుడు ఈ ప్రశ్నకు నాకు సమాధానం దొరికింది" అని భాగ్యశ్రీ బోర్సే అన్నారు. రామ్, భాగ్యశ్రీ బోర్సే జంటగా ఉపేంద్ర కీలకపాత్రలో నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ– "ఈ చిత్రంలో నేను మహాలక్ష్మి అనే కాలేజీ అమ్మాయి పాత్రలో నటించాను. మంచి ఎమోషన్ ఉన్న ఈపాత్ర నాకు చాలా స్పెషల్. సాగర్ (రామ్ క్యారెక్టర్)తో తను ప్రేమలో ఉంటుంది. తెలుగులో నేను కలిసిన తొలి నిర్మాతలు నవీన్, రవిశంకర్‌గార్లు.ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. తెలుగులో నాకు మంచి ప్రేక్షకాదరణ లభిస్తుండం హ్యాపీ. ఆ ప్రేమ నాకు ఇంకా కావాలి. నాకు వచ్చిన ప్రతిపాత్రకి వంద శాతం కష్టపడుతూ, వెర్సటైల్ యాక్ట్రస్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది" అని చెప్పారు.



# తనతో నాది స్పెషల్ బాండ్!

బాలీవుడ్‌లో ఈ ఏడాది సంచలనం సృష్టించిన మూవీ సయారా. చిన్న చిత్రంగా వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. లైగర్ బ్యూటీ అనన్య పాండే కజిన్ అహాన్ పాండే కథానాయకుడిగా పరిచయం అవగా, బాలీవుడ్ నటి అనీత్ పడ్డా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది.

**తను నా బెస్ట్‌ఫ్రెండ్**

ఆన్‌స్క్రీన్‌పై జంటగా కనిపించిన వీరు రియల్ లైఫ్‌లోనూ ప్రేమలో పడ్డట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ రూమర్స్‌పై అహాన్ పాండే స్పందించాడు. ఓ ఇంటర్వ్యూలో అతడు మాట్లాడుతూ.. అనీత్ నా బెస్ట్‌ఫ్రెండ్. సోషల్ మీడియాలో అనుకున్నట్లుగా మేము ప్రేమికులమైతే కాదు. మా మధ్య కెమిస్ట్రీ ఉంది. కానీ అది మీరనుకునే కెమిస్ట్రీ కాదు. కెమిస్ట్రీ అంటే రొమాంటిక్ అని అర్థం కాదు. కంఫర్ట్, భద్రత, ఒకరినొకరు చూసుకోవడం.

**ఇప్పుడైతే సింగిల్**

మా ఇద్దరి మధ్య మంచి బాండింగ్ ఉంది. తనతో ఉన్నట్లుగా నేనెవరితోనూ లేను. అలా అని తను నా ప్రేయసి మాత్రం కాదు. ప్రస్తుతానికి నేను సింగిల్ అని చెప్పుకొచ్చాడు. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన సయారా మూవీ జూలై 18న విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.570 కోట్లు రాబట్టింది. ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034